▼ ఈ వారం సరసం

# శ్రీవారి కథ

## -పైడికొండల వెంకటేశ్వరరావు



గబగబా పరుగెడ్తూ, పరుగెడ్తూ, సరిగ్గా ఆ ఇంటి కిటికీ ముందుకొచ్చి చటుక్కున ఆగిపోయాడు చంద్రుడు.

అతనికి తెలుసు ఆ కిటికీ దగ్గర పసందైన కను'విందు' దొరుకుతుందని.

కిటికీలోంచి ఉత్సకతగా చూస్తున్నాడు చంద్రుడు- మంచంమీదున్న వాళ్ళిద్దర్నీ.

"అనగనగా ఒక రాకుమారుడున్నాడు" అలవాటు ప్రకారం కథ మొదలెట్టాడు మూర్తి.

"వూ" అంది జ్యోతి.

"ఆ రాకుమారుడికి ఓ రాకుమారితో పెళ్ళయింది." "రాకుమారుడికి రాకుమారితో కాక రాకుమారుడితో పెళ్ళవుతుందా?" అన్న ప్రశ్నని గొంతులోనే నొక్కిపట్టి "వూ" అంది జ్యోతి. అతను చెప్తున్నప్పుడు అడ్డం వస్తే చెప్పడం మానేస్తాడని తెలుసుకాబట్టి.

"పూర్తిగా ఏ సుఖాలూ అనుభవించకుండానే యుద్ధం వచ్చింది."

"ఊ"

"యుద్ధం చాలా రోజులు జరిగింది. రాకుమారుడు ఓడిపోయే స్థితి కొచ్చేశాడు. మరొక్కరోజు యుద్ధం జరిగితే చాలు రాకుమారుడి సైన్యం అంతమైపోతుంది. రాకుమారుడు ఓడిపోతాడు."

"ఊ"

"కానీ ఆ రాత్రి ఓ అద్భుతం జరిగింది. రాకుమారుడ్ని విడిచివుండలేక రాకుమారుడి శిబిరంలోకి మారువేషంలో వచ్చేసింది రాకుమారి. ఆమెని చూసి రాకుమారుడు ఆశ్చర్యపోయాడు. ఆపైన ఉప్పొంగిపోయాడు. నీ ఈ ప్రేమ నన్ను ముగ్ధుడ్ని చేసింది. ఏదైనా వరం కోరుకో అన్నాడు రాకుమారుడు."

"ఊ"

"రాకుమారుడ్ని తన గుండెలోకి హత్తుకుంటూ వెళ్ళేముందు కోరుకుంటాను. తప్పక తీర్చాలి మరి అంది రాకుమారి."

"ఊ."

"సరేనన్నాడు రాకుమారుడు."

"ఊ."

"ఆ తర్వాత రాకుమారిని మంచం మీదకి చేర్చి ఇలా...." ఆమె చీర తొలగిస్తూ అన్నాడు మూర్తి.

"వూ."

"ఇలాగే ఆమె ఒంటిమీది బంధానాలన్నీ తొలగించాడు" అంటూ ఆమెని వివస్త్రని చేశాడు మూర్తి.

తర్వాత కథని మూర్తి చెప్పలేదు. చేసి చూపించాడు.

కొద్ది నిమిషాల తర్వాత...

"రాకుమారి ఏం వరమడిగింది?"మత్తుగా అడిగింది జ్యోతి.

"రేపు యుద్ధంలో గెలిచి విజయుడివై నా ముందు నిలబడమని కోరింది."

"తర్వాతేమైంది?" ఆమె నిద్రలోకి జారుకుంటున్నట్లుగా వుంది ఆమె గొంతు ధ్వని.

"ఏమవుతుంది. రాకుమారుడు యుద్ధంలో గెలిచాడు." అని పక్కకి తిరిగిపోయాడు మూర్తి. అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

కిటికీలోంచి చూస్తున్న చంద్రుడు తృప్తిగా ముఖం పెట్టాడు.

* * * *

మర్నాడు రాత్రి...

యథావిధిగా కిటికీ దగ్గరకొచ్చేశాడు చంద్రుడు.

"ఇది నిజంగా నా జీవితంలో జరిగిన కథ.

ఇంతవరకూ నీకేకాదు ఎవరికీ చెప్పని కథ. ఇన్నాళ్ళు నా గుండెల్లోనే ఉండిపోయిన కథ." అన్నాడు మూర్తి.

ఉత్సాహంగా చూసింది జ్యోతి.

"నీతో పెళ్ళికాకముందు సంగతి. ఓ రోజు ఓ అమ్మాయిని చూశాను. చూసీ చూడగానే దేవకన్యలా వున్న ఆ అమ్మాయిని నా స్వంతం చేసుకోవాలనుకొన్నాను. నా అదృష్టం బాగుండి ఆ అమ్మాయి కూడా నన్ను యిష్టపడింది. అయితే ఆ అమ్మాయిని చూసిన రోజు నుంచి నా గదికి రప్పించుకొనేటప్పటికి రెండు నెలలు పట్టింది. ఆ రోజు ఆ అమ్మాయి నా గదికొచ్చింది."

కళ్ళు పెద్దవి చేసుకొని వింటోంది జ్యోతి. ఇది నిజంకాకూడదని మనసులో మరీ మరీ కోరుకుంటూ.

"రావడమైతే వచ్చిందికానీ తీరా వచ్చాక చాలా సిగ్గుపడింది. నేను ధైర్యంగా ఆమె కట్టుకున్న తెల్లచీరని ఇలాగే విప్పేశాను." వింటూ జ్యోతి చీర విప్పేశాడు మూర్తి.

"ఈ బరువులు మొయ్యలేకపోతున్నానని మొత్తుకుంది ఆమె శరీరం. దాని బాధ చూడలేక ఆమె ఒంటిమీద నుండి బట్టల్ని తప్పించాను."

జ్యోతి ఒంటిమీద తాళి తప్ప నూలు పోగులేదు.

"ఆ రాత్రి ఇలాగే మేమిద్దరం స్వర్గాన్ని చవిచూశాం" అతని మాటల్ని డామినేట్ చేస్తూ వినిపించిందతని ఊపిరి– బుసలా.

సరిగ్గా ఆ క్షణంలోనే అడ్డొచ్చిన మేఘాన్ని నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది చంద్రుడికి.

* * * *

"రాత్రి చెప్పిన కథ నిజమా" కాఫీ కప్పు మూర్తి చేతికిస్తూ అడిగింది జ్యోతి. రాత్రి నుంచీ సతమతమైపోతోందామె. అది అబద్ధమవ్వాలనీ, నిన్ను ఏడిపించడానికి ఆ కథ చెప్పానని మూర్తి చెపాలనీ కోరుకుంటోందామె. అదే క్షణంలో ఏం వినాల్సొస్తుందో అని భయపడుతోందామె.

"మాటికి మారుపాళ్ళు నిజం" అన్నారు మూర్తి కాఫీ సిప్ చేసి.

ఆమె గొంతు తడారిపోయింది. ఏం మాట్లాడాలో తెలీలేదామెకి.

"ఎ... ఎ...వ...రా... ఆ...మ్మా...యి?"

ఆమె గొంతు పెగలడంలేదు.

"చూపిస్తారా" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని బెడ్రూంలోకి లాక్కెళ్ళాడు మూర్తి.

అతను సూటికేస్ తెరుస్తోంటే ఊపిరి బిగపట్టి చూస్తోందామె.

అతను చూపించిన ఫోటో చూశాక మతిపోయిందామెకి. నవ్వాలో ఏడవాలో తెలియలేదు. రాత్రి నుంచీ అనుభవించిన టార్చర్ ఎవరో చేత్తో తీసి గట్టుపోయింది. అదే క్షణంలో అతన్ని లాగి లెంపకాయ కొట్టాలనిపించింది ఆమెకి.

ఆ ఫోటోలో వున్నది అక్షరాలా జ్యోతే.

పెళ్ళి చూపులకి ముందు అతనికిచ్చిన ఫోటో అది.

చిలిపిగా నవ్వుడూ అన్నాడు మూర్తి "మన పెళ్ళి చూపులకీ, శోభనానికీ మధ్య రెండు నెలలు. అర్థమైందా."

కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా తమా నవ్వేసింది జ్యోతి.

ఆమెనలాగే పట్టుకొని మంచం దగ్గరకి తీసుకెళ్ళాడు మూర్తి.

... చంద్రుడో బ్రహ్మాండమైన అవకాశాన్ని పోగొట్టుకున్నాడు. అప్పటికి నాలుగ్గంటలముందే చంద్రుడు అస్తమించేశాడు కాబట్టి.





